క్లుప్తంగా

19న రథోత్సవం



చనుగొండ్లలో వెలసిన నాగలింగేశ్వరస్వామి

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో ఈ నెల 19న శ్రీ కేశవ నాగలింగేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న స్వామివారికి అభిషేకాలు, ప్రభోత్సవం, కల్యాణ మహోత్సవం, 19న రథోత్సవం, 20న పారువేట, 21న వసంతోత్సవం, 22న కంకణ విసర్జన కార్యక్రమాలను దేవస్థానం ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గూడూరు: పట్టణంలోని మదర్ థెరిస్సా ఐ క్లినిక్ ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా కర్నూలు కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరవుతారన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

అక్షరశ్రీ పాఠశాల గుర్తింపు రద్దు

కల్లూరు: కల్లూరు అర్బన్ కృష్ణానగర్‌లో ఉన్న అక్షర శ్రీ పాఠశాలలో విద్యార్థులు లేని కారణంగా పాఠశాల గుర్తింపును రద్దు చేశారు. ఈ మేరకు సంబంధించిన నోటీసులను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సీఆర్‌పీలు శివశంకర్, వెంకటరాముడు పాఠశాల కాంపౌండ్ వాల్‌కు అంటించారు.

ఫేస్ యాప్ హాజరు రద్దు చేయాలి

గూడూరు: మున్సిపల్ కార్మికులకు ఫేస్ యాప్ హాజరు విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని సీఐటీయూ కోడుమూరు డివిజన్ కార్యదర్శి జే మోహన్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు జీఓ 159 తెచ్చి ఫేస్ యాప్ హాజరు విధానాన్ని అమలు చేస్తుందని, ఈ విధానంలో కార్మికులు సొంతంగా ఫొటోలు దిగి ప్రభుత్వం తయారు చేసిన యాప్‌లో పంపించాలన్నారు. ఒక వేళ ఫొటో సక్రమంగా రాక పోతే ఆ రోజు కార్మికుడు పని చేసినా హాజరు పడక పోవడంతో జీతంలో కోత పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శాంతన్న, మనోహరమ్మ, నాగమణి, దానమన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కోడుమూరు రూరల్: ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. గురువారం హెచ్‌ఓ మదన్‌మోహన్‌తో కలిసి మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ శనగ రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని రైతులను సంప్రదించి భూసార పరీక్షలు నిర్వహించాలని, వేసవిలో బోరుబావుల కింద పత్తి పంట సాగు చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఓ మదన్‌మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో పండ్ల తోటలు సాగు చేసిన రైతులను గుర్తించి వారికి అవసరమైన సలహాలు, సూచనలివ్వాలన్నారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఓంకార్ యాదవ్

కర్నూలు (న్యూటౌన్): పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పంచలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ యాదవ్ అన్నారు. గురువారం కర్నూలు ఎంఈఓ కార్యాలయంలో కోడుమూరు, సి బెళగల్, కల్లూరు, కృష్ణగిరి మండలాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు రాత్రి 10గంటల వరకు, మళ్లీ ఉదయం 5గంటలకే లేచి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు సరిగా చదివేటట్లు చూసుకునే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా విద్యార్థులను ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వ ‘మద్దతు’

- ఆర్‌బీకేల్లో ఏర్పాటు కానున్న శనగ కొనుగోలు కేంద్రాలు
- రైతులు నష్ట పోకుండా ప్రభుత్వం చర్యలు
- క్వింటా రూ.5340 ప్రకారం కొనుగోలు



శనగ పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం(ఫైల్)

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం పండుగలా మారింది. రైతులకు విత్తు నుంచి పంట దిగుబడులు విక్రయించుకునే వరకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తోంది. తాజాగా పప్పుశనగ సాగు చేసిన రైతుల కోసం ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుంది.రైతులు ప్రైవేట్ వ్యాపారులకు దిగుబడులు అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. రబీ సీజన్‌లో మండలంలో 8330 ఎకరాల్లో సాగు చేసిన వివిధ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఇందులో 3,585 ఎకరాల్లో పప్పు శనగ పంట ఉంది. సాగు చేసిన పప్పు శనగకు మద్దత ధర ప్రకటించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. క్వింటాల్ రూ.5340ల ప్రకారం కొనుగోలు చేయనుంది.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం:
ఈ-క్రాప్ నమోదుతో పాటు ఈ-కేవైసీ చేసుకున్న శనగ రైతుల కోసం ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం ప్రారంభించింది. మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అందులో లక్ష్మీపురం, ఎ.గోకులపాడు, సల్కాపురం, పెద్దపాడు, బస్తిపాడు, పెద్దటేకూరు, ఉలిందకొండ ఉండగా రైతుల విజ్ఞప్తి మేరకు వ్యవసాయాధికారులు మరో మూడు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయనున్నారు. అందులో పర్ల, నాయకల్లు, దూపాడు ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలకు త్వరలో అనుమతులు రానున్నట్లు అధికారులు వెల్లడించారు.

వ్యాపారులకు అమ్ముకోవద్దు



మండలంలో పప్పు శనగ సాగు చేసిన రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు దిగుబడులను అమ్ముకొని నష్టపోవద్దు. ప్రభుత్వమే క్వింటాం రూ.5,340కు కొనుగోలు చేస్తుంది. రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల దగ్గరనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. అయితే రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవడంతోపాటు ఆర్‌బీకేలో ఉన్న వీఏఏ/వీహెచ్‌ఏల దగ్గర పేర్లు నమోదు చేసుకోవాలి. – శ్రీనివాసరెడ్డి, ఏఓ, కల్లూరు.

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు

-విజేతగా కొత్తూరు వృషభాలు



అనుగొండలో బండ లాగుతున్న వృషభాలు

కోడుమూరు: మండలంలోని అనుగొండ గ్రామంలో వెలసిన శ్రీఅవధూత రామిరెడ్డి తాత తిరుణాలను పురస్కరించుకొని గురువారం తాత సేవాసంస్థాన్ సభ్యులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరు సుబ్రమణ్యేశ్వరరెడ్డికి చెందిన వృషభాలు 3600అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలువగా, ఇదే వ్యక్తికి చెందిన మరో జత వృషభాలు 3375అడుగుల దూరం బండను లాగి 2వ స్థానంలో నిలిచాయి. వెల్దుర్తి మండలం కలుగొట్ల బజారి, దొర్నిపాడు మనోహర్‌లకు చెందిన వృషభాలు 3216అడుగుల దూరం బండను లాగి 3వ స్థానంలో, కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శివరాముడు, నంద్యాల క్రాంతినగర్ అనూషరాణి వృషభాలు 2860అడుగుల దూరం బండను లాగి 4వస్థానంలో, వర్కూరు మద్దయ్యకు చెందిన వృషభాలు 2800అడుగుల దూరం లాగి 5వ స్థానంలో, మునగాల రామాంజినేయులు, సంగాల హనుమన్న వృషభాలు 2636 అడుగుల దూరం బండను లాగి 6వ స్థానంలో గెలుపొందాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30,016లు, రూ.22,016లు, రూ.17,016లు, రూ.12,016లు, రూ.9,016లు, రూ.6,016లను దాతల సహకారంతో రామచంద్రారెడ్డి అందజేశారు.

18 నుంచి కాల్వబుగ్గలో వినోద, కాలక్షేప కార్యక్రమాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 18 నుంచి వినోద కాలక్షేప కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. శ్రీభ్రమరాంబ, బుగ్గరామేశ్వర స్వాముల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం రాత్రి 8.30 నుంచి 9.00 గంటల వరకు ఆంజనేయులు సారధ్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. తర్వాత హైదరాబాద్‌కు చెందిన ఉజ్వల ఈవెంట్స్ అండ్ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో సినీ ప్లేబ్యాక్ సింగర్లు ప్రమానేహ, ప్రవీణ్, ప్రసాద్, యశశ్వినీ, జబర్దస్త్ ఆర్టిస్టు ఆల్ రౌండర్ రవి, యాంకర్ నాగభార్గవి, ఆర్కెస్ట్రా ఎంవీ ఫణీంద్రల నేతృత్వంలో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా 19వ తేదీన రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సూర్యకళా నిలయం డ్యాన్స్ మాస్టర్ కే సుధాకర్‌రావు చేత కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో వెలసిన శ్రీ భవాని సమేత శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఉత్సవాల్లో గురువారం నంది విగ్రహం గ్రామోత్సవం చేపట్టారు. 17న గణపతి పూజ, అభిషేకాలు, కలశ పూజ, నంది విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 18న మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవం, భజన కార్యక్రమాలు, నందికోలు, కల్యాణ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. 19న ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం

-డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య



ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ప్రజలకు వరం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. గురువారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రతి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఉదయం హెల్త్ క్యాంపు నిర్వహించి క్యాంపు దగ్గకు వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు చేసి, చికిత్సలు అందించాలన్నారు. మధ్యాహ్నం బాలింతలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్ల దగ్గరకు వెళ్లి ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. అనంతనం ఆయన ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి గర్భిణీని 12 వారాలోపు నమోదు చేసి ఆరోగ్య సేవలు అందించి, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలన్నారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త రోజుకు 20 ఐడీలు జనరేట్ చేసేలా చూడాలన్నారు. కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

1962 టోల్‌ఫ్రీతో ఆవుకు తక్షణ వైద్యం



సి.బెళగల్‌లో గాయపడిన ఆవుకు వైద్యం చేస్తున్న పశువైద్యులు ప్రవీణ్, రీచర్డ్స్, రాహుల్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో పశువైద్యులు గాయపడిన ఆవుకు ప్రత్యేక వైద్యం చేసి ప్రాణాన్ని నిలబెట్టారు. వివరాలు.. మండలంలోని పల్‌దొడ్డి గ్రామంలో రైతు నరసన్నకు చెందిన ఆవు పశువుల కొట్లాటలో కొమ్ము విరిగి తీవ్రంగా రక్తస్రావం అయింది. ఆందోళన చెందిన రైతు డాక్టర్ వైఎస్సార్ పశు సంచార వైద్యసేవ అంబులెన్స్ టోల్‌ఫ్రీ నంబర్ 1962ను సంప్రదించాడు. స్పందించిన విజయవాడ కాల్ సెంటర్ వారు కోడుమూరులో ఉన్న పశు సంచార వైద్యసేవ అంబులెన్స్ పశువుల డాక్టర్ రాహుల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తక్షణమే మారుమూల గ్రామమైన పల్‌దొడ్డికి పశువుల అంబులెన్స్ తీసుకెళ్లి ఆవుకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం సి.బెళగల్ పశు వైద్యశాలకు తీసుకువచ్చారు. సి.బెళగల్, పోలకల్ పశువైద్యులు ప్రవీణ్, రీచర్డ్స్‌ల సహకారంతో ఆవుకు విరిగిన కొమ్ము తొలగించి మందులను వేశారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆవును బతికించడంతో పాడి రైతు నరసన్న వైద్యులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్య ఆలోచనలు రావాలి

పాణ్యం: విద్యార్థుల్లో నైపుణ్య ఆలోచనలు రావాలని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ టెక్నాలజీ ప్రొఫెసర్ గోపీకృష్ణారావు అన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ‘పాఠశాలలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్’ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యంగా సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యార్థులు ఆలోచన చేయాలన్నారు. పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, కృష్ణమరాజు, ఫాసియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కాశీవిశ్వేశ్వర సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ, 36వ వార్డులలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. 36వ వార్డు వాసవి నగర్‌లో శ్రీ శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో జరిగిన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ హాజరై పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం 28వ వార్డు పందిపాడులో వెలసిన కాశీవిశ్వేశ్వర సీతారామాంజనేయస్వామి దేవాలయంలో శివపరివార, రామపరివార, సహిత హనుమత్ దేవతా, నాగదేవత విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సలకు ఎమ్మెల్యే కాటసాని హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా కల్లూరు అర్బన్ 32వ వార్డు సంఘంలోని అశ్వర్థ నారాయణ స్వామి దేవాలయంలో వెలసిన శ్రీ అవధూత రామిరెడ్డి తాత ఆరాధన కార్యక్రమానికి కాటసాని శివనరసింహారెడ్డి, సతీమణీ కాటసాని రూపశ్రీ, మహేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు.

సంక్షేమ పాలనలో ఏపీ ఆదర్శం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడూరు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, అందుకే పక్క రాష్ట్రాలు ఏపీకి వచ్చి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి కొనియాడుతున్నాయని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక పీఎస్ అస్లామ్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ..స్థానిక టీడీపీ నాయకులు ఆకేపోగు ప్రభాకర్, గజేంద్రగోపాల్ తదితరులు సీఎంపై లేనిపోని ఆరోపణలు చేశారని మండిపడ్డారు. సీఎంను విమర్శించే స్థాయి వారికి లేదని, గూడూరు పట్టణం అభివృద్ధి ఎవరి హయాంలో ఎంత జరిగిందో బహిరంగ చర్చ కు రావాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని, అందుకే ఆ పార్టీ నాయకులు పక్క చూపులు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే ఆబేలు, పత్తి రంగడు, కౌన్సిలర్లు ఖలీలు, టీచర్ కిషోర్, కుమార్, మద్ది, కే నాగులాపురం నరసింహారెడ్డి, చనుగొండ్ల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



షార్ట్ సర్క్యూట్‌తో ఎగసి పడుతున్న మంటలు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రూ.లక్ష నష్టం వాటిల్లింది. బాధితుడు మూల ఇసాక్ తెలిపిన వివరాల మేరకు...గురువారం తెల్లవారు జామున తన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పక్కనే ఉన్న పశువుల కొట్టానికి మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు ప్రక్కల వారు గమనించి పశువులను కాపాడారు. ఇంట్లో ఉన్న వ్యవసాయ పనిముట్లు, పైపులు పూర్తిగా కాలిపోయాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ శేఖర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లారెడ్డి పరామర్శించారు.

19న భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన రాత్రి 9.30 గంటలకు భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆకుల మహేష్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన భజన జట్లకు వరుసగా మొదటి బహుమతి అర తులం బంగారు, రెండవ బహుమతి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.9 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, చివరి బహుమతి రూ.2 వేల చొప్పున నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి గల భజన బృందాలు ఒక్కరోజు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

23న మండల మీట్

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన గడివేముల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. మండల మీట్‌కు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కావున మండలస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు తప్పక పాల్గొనాలని సూచించారు.

ఐకమత్యంగా ఉండాలి

గూడూరు రూరల్: ప్రజలందరూ ఐకమత్యంతో మెలగి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎస్‌ఐ సోమ్లానాయక్ పేర్కొన్నారు. కె.నాగలాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని సల్కాపురం గురువారం ఆయన గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో గొడవలు, ఘర్షణలు వంటి వాటికి దూరంగా ఉండాలని, అందరు ప్రశాంతంగా జీవించాలని సూచించారు. మత్తు పదార్థాలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారాన్ని అందించి సహకరించాలని ఆయన కోరారు.

భూకంప బాధితులకు ఆర్థిక సాయం



భూకంప బాధితులకు సేకరించిన నగదును మత పెద్దలను అందజేస్తున్న ముస్లింలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన ముస్లింలు తమ పెద్ద మనసును చాటుకున్నారు. గత పది రోజుల క్రితం సిరియా, తుర్కియే దేశాలలో సంభవించిన భారీ భూకంపాలతో వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరెందరో నిరాశ్రయులు అయిన విషయం విదితమే. ఆయా దేశాలలో జరిగిన నష్టంపై సి.బెళగల్ ముస్లింలు తమ వంతు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. మతపెద్దలు సూచన మేరకు గ్రామంలోని మూడు మసీద్‌లలోని సభ్యులు తలా కొంత చందాలు వేయడంతో రూ.12,800లు వసూలు అయ్యాయి. ఆ మొత్తాన్ని మతపెద్దలు, ముస్లింలు గురువారం మండల ఆవాజ్ కమిటీ ద్వారా జిల్లా కమిటీ సభ్యులు సుభాన్, గఫూర్‌లకు అందజేశారు. చందా నగదును బాధిత దేశాలకు పంపడం జరుగుతుందని జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు ఎస్‌ఎం బాషా, హారున్, ఇబ్రహీం, వలి, దౌలత్‌ఖాన్, ఉస్మాన్‌బాష తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- సభకు గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వాలి
- సాదాసీదాగా కోడుమూరు మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదిక చదివి విన్పిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మంజుల నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సభనుద్దేశించి జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సమావేశంలో సభ దృష్టికి వచ్చే సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తప్పక పరిష్కరించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధన ఉందని, అవి ఏ మేర అమలు చేస్తున్నారో తెలపాలని విద్యాశాఖాధికారులను కోరారు. ఏఓ రవి ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పప్పుశనగ క్వింటాల్ రూ.5340 ప్రకారం కొనుగోలు చేస్తోందని, రైతులంతా ఆయా ఆర్‌బీకేల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు మాట్లాడుతూ మండలానికి నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు కింద 265 గృహాలు, పీఎంఏవై కింద 960 గృహాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం అవి వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు.ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోని మంచినీటి పథకాలన్నింటిని పునరుద్ధరించడం జరుగుతుందని, ఏ గ్రామంలోనైనా నీటి సమస్య తలెత్తితే వెంటనే నివారణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏపీఓ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో వలసల నివారణకై ప్రభుత్వం కూలీలందరికి ఉపాధి పనులు కల్పిస్తోందన్నారు. మునగ సాగు చేసేందుకు రైతులు ముందుకొస్తే ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నారు. ఎంపీపీ గాడీ రూతమ్మ మాట్లాడుతూ 3నెలలకోసారి జరిగే సమావేశాలకు అధికారులు రాకపోతే ఎలా అని, సభకు గైర్హాజరైన వారికి వెంటనే నోటీసులివ్వాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మంజులకు సూచించారు. సమావేశంలో ఏపీఎం పుష్పావతి, హెచ్‌ఓ మదన్‌మోహన్, ఎలక్ట్రికల్ ఏఈ బసీర్‌అహ్మద్, లద్దగిరి వైద్యాధికారిణి సబీరా నస్రీన్, పీఆర్ ఏఈ గంగరాజు తదితరులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి విన్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహారంపై మహిళలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారంను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. గురువారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలోని 8, 9 అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కేంద్రాలలోని బాలికలు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. బాలలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత సమస్యలు లేకుండా ఉండేందుకు బలవర్థకమైన ఆహార పదార్థాలను ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తుందని, తప్పనిసరిగా ఆహారంను అంగన్‌వాడీ కేంద్రాలలోనే తినే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. బలహీనంగా ఉండే చిన్నారులు, మహిళల ఆరోగ్య రక్షణకు, రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా కేంద్రాల టీచర్లను ఆదేశించారు. పోలకల్ – 3 గ్రామ సచివాలయంను ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి తనిఖీ చేశారు. గ్రామంలో ఉద్యోగులు చేపట్టిన ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. పల్లెల్లో పేదరిక నిర్మూలన, పౌష్టికాహార లోప నివారణ, నాణ్యమైన ఉచిత విద్యా, వైద్యం వంటి సదుపాయాలు, లబ్ధిపై సమగ్రంగా సర్వేను నిర్వహించి నివేదికలను యాప్‌లో నమోదు చేయాలని సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ ఆదేశించారు.

జాతివైరం మరచి..

పందులు కనిపిస్తే శునకాలు వెంటపడి తరముతాయి. అయితే ఓ తల్లి శునకం వరాహం పిల్లకు పాలిచ్చి ఆకలి తీర్చింది. జాతి వైరం మరచి తల్లి ప్రేమను పచ్చిన ఈ సంఘటన గురువారం సి.బెళగల్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వీధిలో చోటు చేసుకుంది. ఈ దృశ్యాన్ని పలువురు ఆసక్తిగా తిలకించి తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

– సి.బెళగల్



సి.బెళగల్ వరహం పిల్లకు తన పిల్లలతో కలిసి పాలు ఇస్తున్న శునకం